సాక్షి
వనపర్తి
బుధవారం ၊ 24 ၊ సెప్టెంబర్ ၊ 2025



శక్తి స్వరూపిణి.. బ్రహ్మచారిణి
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జోగుళాంబ అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు.
-8లో ▸



జూరాలకు భారీగా వరద
జూరాల జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో 45 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు.
-8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0/22.9

వాతావరణం
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



గాయత్రిదేవిగా దర్శనం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆత్మకూర్ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 9 రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు. రోజు బతుకమ్మ పూజలు, బొడ్డెమ్మలు, సహస్ర కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. - ఆత్మకూర్

న్యూస్‌రీల్

రామన్‌పాడు నుంచి నీటి విడుదల



మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. కోయిల్‌సాగర్ జలాశయం, జూరాల ఎడమ కాల్వ నుంచి 523 క్యూసెక్కుల వరద రావడంతో ఒక గేట్ ఎత్తి 4 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నామన్నారు. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. అలాగే జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 935 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

26న లంబాడీ భేరి : మాజీ మంత్రి



వనపర్తి విద్యావిభాగం: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలకు నిరసనగా ఈ నెల 26న జిల్లాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 'లంబాడీ భేరి' నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలో లంబాడి నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీల నోటి కాడి ముద్దను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కోవాలని చూస్తోందని.. జరుగుతున్న అన్యాయాన్ని బీఆర్‌ఎస్ సహించదన్నారు. లంబాడీల కోసం నాటి కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, పోడు భూములకు పట్టాలు, ప్రత్యేక పంచాయతీలు, కల్యాణలక్ష్మి, రైతు బీమా, రైతు రుణమాఫీ తదితర పథకాలు అమలు చేసిందని, కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సన్నాహక సమావేశంలో జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, నారాయణ నాయక్, టీక్యానాయక్, గోపాల్‌నాయక్, పీక్యానాయక్, రమేష్ నాయక్, శ్రీనునాయక్, రాజ్‌కుమార్‌నాయక్, గోవిందునాయక్, పెద్దమందడి కృష్ణానాయక్, సక్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



వనపర్తిటౌన్: ఇళ్లల్లో సిలిండర్ మంటలు చెలరేగినప్పుడు దాని చుట్టూ తడి కాటన్ వస్త్రాన్ని చుట్టాలని, తద్వారా ఆక్సిజన్ అందక మంటలు అదుపులోకి వస్తాయని జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మా అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఐఈఓ ఎర్ర అంజయ్య విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం కొందరు విద్యార్థినులతో సిలిండర్ మంటలను ఆర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

భూ సేకరణే అడ్డంకి

రెండేళ్లుగా ముందుకు సాగని సింగోటం– గోపల్‌దిన్నె లింక్ కెనాల్



అసంపూర్తిగా ఉన్న సింగోటం– గోపల్‌దిన్నె కాల్వ

- 22.5 కి.మీ., గాను ఇప్పటి వరకు 5 కి.మీ. మేరకే తవ్వకాలు
- పరిహారం పెంచితేనే భూములిస్తామని రైతుల డిమాండ్
- ఇటీవల మంత్రి జూపల్లి పునః ప్రారంభించినా మందకోడిగానే..
- కాల్వ పూర్తయితే 34 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

కొల్లాపూర్: ఉమ్మడి జిల్లాలోనే వెనకబడిన కొల్లాపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందించాలనే లక్ష్యంతో చేపట్టిన సింగోటం– గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు ఏళ్లతరబడిగా సాగుతూనే ఉన్నాయి. భూ సేకరణ కారణంగా రెండేళ్లుగా నిలిచిపోయిన ఈ పనులను పూర్తి చేసేందుకు ఇటీవలే మంత్రి జూపల్లి కృష్ణారావు పునఃప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితులను గమనిస్తే ఈసారైనా పనులు ఆటంకం లేకుండా ముందుకు సాగుతాయా.. లేదా.. అనే సంశయం నెలకొంది. ఈ కెనాల్ పూర్తయితే ఐదు మండలాల పరిధిలోని 34 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సమస్యలు తీరుతాయని రైతులు భావిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం కోసం..

జూరాల ఎడమ కాల్వ, భీమా కెనాల్ కింద చివరి ఆయకట్టు భూములు కొల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో రైతులకు రబీ సీజన్‌లో రెగ్యులర్‌గా సాగునీటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే సింగోటం– గోపల్‌దిన్నె లింకు కెనాల్‌కు శ్రీకారం చుట్టారు. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని మళ్లించే విధంగా ప్రణాళిక రూపొందించారు. 2018లో ఈ కెనాల్ నిర్మాణానికి నిధుల కేటాయింపు చేసినా.. చాలాకాలం తర్వాత 2022లో రూ.147.7 కోట్లు మంజూరు చేసింది. 2023లో ఊపందుకున్న పనులు.. తర్వాతి కాలంలో నిధుల విడుదలలో జాప్యం, భూ సేకరణ సమస్య కారణంగా నిలిచిపోయాయి.

మంత్రి జూపల్లి సమీక్ష..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు కెనాల్ తవ్వకంపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగానే గత నెలలో కెనాల్ పనులను పునఃప్రారంభించారు. భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణ కోసం కలెక్టర్ల వద్ద రూ.25 కోట్ల మేర నిధులు ఉండడంతో రైతులకు న్యాయబద్ధమైన పరిహారం చెల్లించాలని సూచించారు. దీనిపై గ్రామాల వారీగా రైతులతో మాట్లాడేందుకు మంత్రి సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. త్వరలోనే భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్చలు జరుగుతున్నాయని అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు వెల్లడించారు.

ప్రయోజనం ఇలా..

సింగోటం– గోపల్‌దిన్నె లింకు కెనాల్‌తో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఐదు మండలాల రైతాంగానికి మేలు జరగనుంది. వీపనగండ్ల, చిన్నంబావి, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోని చివరి ఆయకట్టు పొలాలతోపాటు పాన్‌గల్ మండలంలో కొంతమేరకు సాగునీరు అందుతుంది. లింక్ కెనాల్ ద్వారా నీటి సరఫరా ప్రారంభమైతే జూరాల లెఫ్ట్ కెనాల్ కింద ఉన్న 24,500 ఎకరాలు, రాజీవ్ భీమా కాల్వల కింద ఉన్న 9,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు వస్తుంది. అలాగే వేసవిలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ కింద ఉండే పలు గ్రామాలకు తాగునీటి సమస్య కూడా తీరుతుంది.

22.5 కి.మీ. మేర కెనాల్

సింగోటం రిజర్వాయర్ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్ వరకు 22.5 కి.మీ. మేర కెనాల్ తవ్వకాలు చేపట్టారు. ఇందులో వనపర్తి జిల్లా పరిధిలో 18 కి.మీ. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 4.5 కి.మీ. కాల్వ తవ్వాలి. అయితే వనపర్తి పరిధిలో 200 ఎకరాలు, నాగర్‌కర్నూల్ పరిధిలో వంద ఎకరాల మేర భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. భూ సేకరణకు సంబంధించి ఎకరాకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తర్వాత దానిని రూ.6 లక్షలకు పెంచారు. కానీ, రైతులు ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తేనే భూములు ఇస్తామని తెగేసి చెప్పడంతో కాల్వ పనులు రెండేళ్ల క్రితం ఆగిపోయాయి. గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి దాదాపు 5 కి.మీ. మేర మాత్రమే కాల్వ తవ్వి ఆపేశారు.

వచ్చే సీజన్ నాటికి..



లింక్ కెనాల్ కోసం దాదాపు 300 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇందుకోసం గ్రామాల వారీగా రైతులతో గతంలోనే మాట్లాడాం. ఇటీవల భూసేకరణ అంశాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ప్రస్తావించి.. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటి వరకు 5 కి.మీ. మేరకు కాల్వ తవ్వకం పూర్తయింది. చాలాచోట్ల అక్విడెక్టు పనులు కూడా పూర్తి చేశారు. భూ సేకరణపై రెవెన్యూ అధికారులు దృష్టిసారించారు. వచ్చే సీజన్ నాటికి కెనాల్ పనులు పూర్తికావొచ్చని భావిస్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



వైద్యాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, **వైద్యశాఖకు** సంబంధించిన ఫ్లాగ్‌షిప్ కార్య**క్రమాలు పకడ్బందీ**గా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎస్‌బీసీ మందిరంలో వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల 2 వరకు జరిగే స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ఇప్పటి వరకు ఎంతమంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.. ప్రత్యేక వైద్య నిపుణులు ఎవరెవరు వచ్చారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 10 వేల పైచిలుకు వరకు పిల్లలు, మహిళలు ప్రత్యేక వైద్య పరీక్షలకు హాజరయ్యారని, రోజుకో స్పెషలిస్ట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సమాధానమిచ్చారు. వైద్య నిపుణుడు వచ్చే ముందురోజు ప్రజలకు సమాచారం ఇచ్చి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వనపర్తి హెల్త్ పోర్టల్‌లో రోగుల వివరాలు నిక్షిప్తం చేసి వారికి సంక్షిప్త సందేశం అందించేందుకు సరైన వాట్సాప్ నంబర్లు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది 63 డెంగీ కేసులు నమోదయ్యాయని, డెంగీ ప్రబలిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారుల సహకారంతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ శాతం పెంచాలని, అదేవిధంగా 5వ ఏఎన్‌సీ చెకప్ సైతం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వసతిగృహ విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించడానికి హెచ్‌బీ1సీ పరీక్షల సంఖ్య పెంచాలని సూచించారు. సమీక్షలో జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంగారావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా. చైతన్య, డా. సాయినాథ్‌రెడ్డి, డా. పరిమళ, డా. మంజుల పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ, విద్యపై ప్రత్యేక దృష్టి..

పోషణ మాసం, బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2 వరకు జిల్లాలో కొనసాగే పోషణ మాసం, అలాగే బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవానం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలు, మహిళలకు పౌష్టికాహార లోపంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లలోపు ప్రతి బాలిక చదువు కొనసాగించేలా చూడాలని సూచించారు. బాల్య వివాహాలను ముందే గుర్తించి అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఆర్డీఓ ఉమాదేవి, డీసీపీఓ రాంబాబు, సీడీపీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



వివరాలు సేకరిస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామ మైనింగ్ ప్రాంతాన్ని మంగళవారం మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామంలోని సర్వేనంబర్ 230, 232, 233, 234, 235, 251, 252 తదితర సర్వేనంబర్లలో ఉన్న 12.16 ఎకరాల తవ్వకాలకు ప్రభుత్వం 2005లోనే అనుమతినిచ్చింది. ప్రభుత్వం అనుమతినిచ్చిన సర్వేనంబర్లలో కాకుండా 243, 245లో కొంతవరకు తవ్వకాలు చేపట్టి అక్కడున్న గొల్లకుంటను ధ్వంసం చేశారని వాల్యానాయక్‌తండా రైతుల ఫిర్యాదు మేరకు పరిశీలించామని.. రైతులు, గ్రామస్తులతో వివరాలు, జీపీఎస్ యంత్రం ద్వారా మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించినట్లు అధికారులు వివరించారు. మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో వివరాల సేకరణకు అంతరాయం ఏర్పడిందని.. మరోమారు సందర్శించి పూర్తి వివరాలు సేకరించి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సురేఖ, మైనింగ్ సర్వేయర్ సుజాత, ఆర్ఐ మహేష్, ఇన్‌చార్జ్ సర్వేయర్ శివకుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఇతర అధికారులు

వనపర్తి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రెవెన్యూ అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నిషేధిత భూములు, రెవెన్యూ సదస్సు పెండింగ్ దరఖాస్తులపై చర్చించారు. జిల్లా నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, సర్వే ల్యాండ్ ఏడీ బాలకృష్ణ, ఏఓ భానుప్రకాష్, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాదా బైనామాలు, అసైన్డ్ ల్యాండ్ దరఖాస్తులకు నోటీసులు జారీ చేయాలన్నారు. నిషేధిత భూముల జాబితాలోని అసైన్డ్, వక్ఫ్ భూములను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అలాగే కొత్త సర్వేయర్లు వచ్చారని.. జిల్లాలో ఉన్న అసైన్డ్, వక్ఫ్ భూములు సర్వే చేయించి ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 121 ప్రకారం నిర్ణీత ఫార్మెట్ పూరించి నివేదికలు పంపించాలని ఆదేశించారు.

బతుకమ్మ.. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక



కొత్తకోట: తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలిచిందని.. ఈ వేడుకలు మహిళల ఐక్యతకు అద్దం పడుతున్నాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారిణి విమలక్క అన్నారు. మంగళవారం కొత్తకోటలో బీసీ కులాల ఐక్య విద్య కన్వీనర్ గొనికాడి రాములు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మ వద్ద ఆమె మహిళలతో కలిసి ఆడిపాడారు. ఆమె రాకతో పట్టణంలో సందడి నెలకొంది.

సేవాస్ఫూర్తి.. చైతన్యదీప్తి

'ఎన్‌ఎస్‌ఎస్'తో విద్యార్థి దశ నుంచే సమాజసేవ వైపు

విద్యతో పాటు సమాజ సేవ, క్రమశిక్షణను విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడమే జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) లక్ష్యం. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురైన గ్రామాలను ఎంపిక చేసి.. వారం రోజుల పాటు విద్యార్థులు అక్కడే ఉండి ఏదో ఒక రూపంలో సేవలందిస్తారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలు, బాల్యవివాహాలు, మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలు.. ఇలా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయడంలో డిగ్రీ, పీజీ విద్యార్థులు కీలకం కానున్నారు.

- మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

- 2025–26 క్యాంపుల నిర్వహణకు నిధులు విడుదల
- స్వచ్ఛత, పరిశుభ్రత, మూఢ నమ్మకాలపై ప్రజల్లో అవగాహన
- జనాభా, పిల్లలు, వ్యాధులు తదితర అంశాలపై సర్వే
- పీయూ పరిధిలో మొత్తం 100 యూనిట్లు



పీయూలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు (ఫైల్)

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2025–26 విద్యాసంవత్సరానికిగాను ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు నిర్వహించేందుకు పాలమూరు యూనివర్సిటీ అధికారులు ఇటీవల నిధులు విడుదల చేశారు. ఈమేరకు ఇప్పటికే పలు చోట్ల క్యాంపులు ప్రారంభమయ్యాయి. పీయూ పరిధిలో మొత్తం 100 యూనిట్లు ఉండగా.. 45 మంది విద్యార్థులు (వలంటీర్ల)తో ఒక్కో యూనిట్‌ను ఏర్పాటు చేశారు. క్యాంపునకు అయ్యే ఖర్చుల కోసం ఒక్కో క్యాంపునకు రూ.35 వేల చొప్పున మంజూరు చేశారు. మొత్తం పీయూ పరిధిలో 100 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉండగా అందులో మొదటి విడతగా 51 యూనిట్లకు అధికారులు రూ. 17.75 లక్షలను విడుదల చేశారు. ఇక్కడ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు అధికారులు ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సర్టిఫికెట్లను అందిస్తారు. వాటితో అడ్మిషన్లు తదితర విషయాల్లో ఎన్‌ఎస్‌ఎస్ సర్టిఫికెట్ కీలకంగా మారనుంది.

జిల్లాల వారీగా వివరాలిలా..

జిల్లా	మొత్తం యూనిట్లు	వలంటీర్ల సంఖ్య	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	13	585	4.55
నాగర్‌కర్నూల్	11	495	3.85
జోగుళాంబ గద్వాల	10	450	3.50
వనపర్తి	13	585	4.55
వికారాబాద్-రంగారెడ్డి	4	180	1.40
మొత్తం	51	2,295	17.75

వారం రోజులు సామాజిక కార్యక్రమాలు

క్యాంపులో వారం రోజుల పటు ఎంపిక చేసుకున్న గ్రామం, ప్రాంతంలో విద్యార్థులు అక్కడే ఉండాల్సి ఉంటుంది. వారికి అధికారులు భోజనం, వసతి కల్పిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధులు శుభ్రం చేయడం, పిచ్చిమొక్కలను తొలగించడం, చెత్తా చెదారాన్ని ఊడ్చడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం, ఉదయం వేళల్లో స్థానిక ప్రజలకు మూఢనమ్మకాలు, క్షుద్రపూజలపై అవగాహన కల్పిస్తారు. చివరి రెండు రోజులు గ్రామంలో ఉండే ప్రజల వివరాలు, వారికి ప్రభుత్వం నుంచి అందే పథకాలు, తాగునీరు, అందుతున్న వైద్య సేవలు, అధికంగా ప్రబలుతున్న రోగాలు తదితర అంశాలపై సర్వే నిర్వహించి సంబంధిత నివేదికను గ్రామ, పీయూ అధికారులకు అందిస్తారు. నివేదికలో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఆస్కారం ఉంది. పలు చోట్ల ప్రజలకు అవసరమైన మెడికల్ క్యాంపులను సైతం నిర్వహించి ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తారు.


నిధులు విడుదల చేశాం



2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి క్యాంపుల నిర్వహణ ప్రారంభమైంది. మొత్తం పీయూ పరిధిలో 100 యూనిట్లు ఉండగా వాటిలో మొదటి దశలో ఎంపిక చేసి 51 యూనిట్లకు రూ.17.75 లక్షలను విడుదల చేశాం. మరో 49 యూనిట్లకు వచ్చే నెల నిధులు కేటాయిస్తాం. ఈ క్యాంపుల ద్వారా విద్యార్థులకు సామాజిక అవగాహన పెరడంతో పాటు ప్రజలకు సైతం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– ప్రవీణ, పీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్

అవగాహన పెంపు



విద్యార్థులకు యూజీ, పీజీ స్థాయిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు నిర్వహిచడం వల్ల వారికి సామాజిక అంశాలపట్ల అవగాహన పెరుగుతుంది. క్యాంపులో భాగంగా వారం రోజుల పాటు విద్యార్థులు అక్కడే ఉండి ఉదయం వేలల్లో పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలు, రాత్రి వేళల్లో పలు అంశాలపై నాటికలు, కథల రూపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– గాలెన్న, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి

విద్యార్థులకు ప్రయోజనం



ఎన్‌ఎస్‌ఎస్‌లో భాగంగా ఇప్పటికి అనేక కార్యక్రమాలు నిర్వహించాం. వాటిలో భాగంగా ప్రజలకు స్వచ్ఛభారత్, నషా ముక్తభారత్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. వీటి ద్వారా అనేక అంశాలను ఒక విద్యార్థిగా తెలుసుకునేందుకు అవకాశం ఉంది. ఎన్‌ఎస్‌ఎస్ సర్టిఫికెట్ బవిష్యత్తులో ఎంతో ఉపయోగడపతుంది.

– సరిత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

క్లుప్తంగా

900 కేజీల నల్లబెల్లం పట్టివేత



లింగాల: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని సోమవారం రాత్రి స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ జనార్దన్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో వాహనంలో తరలిస్తున్న 900 కేజీల నల్లబెల్లాన్ని పట్టుకొని నల్లపోతుల హరీశ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి తహసీల్దార్ పాండునాయక్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

లింక్ ఓపెన్.. రూ.3 లక్షలు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం: ఫోన్‌కు వచ్చిన అపరిచిత లింక్ ఓపెన్ చేయడంతో బ్యాంక్ ఖాతా నుంచి రూ.3 లక్షలు సైబర్ నేరస్తులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో నివాసం ఉంటున్న వసంత్ ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు ఓ లింక్‌ను పంపించారు. ఈ క్రమంలో లింక్ ఓపెన్ చేయగా బ్యాంకు ఖాతా నుంచి రూ.3 లక్షలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం సైబర్ పోర్టల్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

చిన్నారుల అశ్లీల చిత్రాలు ఫార్వర్డ్

- ముగ్గురిపై కేసు నమోదు

వెల్దండ: మండలానికి చెందిన చిన్నారి బాలబాలికల అశ్లీల చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ఫార్వర్డ్ చేసిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. చిన్నారుల అశ్లీల చిత్రాలు చూసినా.. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు పంపించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇలాంటి వాటిని గుర్తించేందుకు ప్రత్యేకంగా నిఘా విభాగం పనిచేస్తుందని తెలిపారు. వారి సమాచారం మేరకు ముగ్గురిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు.

రహస్యంగా మహిళల వీడియోల చిత్రీకరణ

ధన్వాడ: మహిళలు స్నానం చేసే సమయంలో రహస్యంగా వీడియోలు చిత్రీకరించిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని హన్మాన్‌పల్లి గ్రామానికి చెందిన కుర్వ సత్తయ్య మంగళవారం ఉదయం ఓ మహిళ బాత్‌రూంకు వెళ్లగా పైన ఉన్న వెంటిలేటర్ కిటికీలో నుంచి వీడియో తీశాడు. ఫోన్ ఫ్లాష్ లైట్ పడటంతో సదరు మహిళ గుర్తించి అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా చేతిలో ఉన్న ఫోను జారి కిందపడగా.. వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో బాధితులు ఈ విషయం భర్తకు చెప్పడంతో ఫోన్ ఎవరిది అని ఆరాతీయగా గ్రామానికి చెందిన కుర్వ సత్తయ్యగా గుర్తించారు. ఫోన్ అన్‌లాక్ చేసి చూడగా అందులో మరో ఆరుగురు మహిళలు బాత్‌రూం వెళ్లినప్పుడు తీసిన వీడియోలు ఉండటంతో వెంటనే ధన్వాడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ రాజశేఖర్ స్పందిస్తూ.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

అలంపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన వివరాలు.. పెబ్బేర్ మండలం చెలిమిల్లకు చెందిన నాగమణి(48) భర్త గోపాల్‌తో కలిసి బొంతల వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలో మంగళవారం లింగనవాయికి భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో నాగమణి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఊట్కూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సమీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జోగుళాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



నిత్యపూజల్లో అర్చక స్వాములు

శక్తిస్వరూపిణి.. బ్రహ్మచారిణి



జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో జోగుళాంబదేవి

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలు
- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అలంపూర్: జోగుళాంబ అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం బ్రహ్మచారిణి దేవిగా దర్శనమిచ్చి భక్తుల చేత విశేష పూజలందుకున్నారు. బ్రహ్మచారిణి మాతగా కొలువుదీరిన అమ్మవారికి అర్చక స్వాములు ప్రత్యేక మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు కొలువు పూజ, దర్బారు సేవ, కుమారి పూజ, సువాసినీ పూజ అనంతరం మహామంగళ హారతి, నీరజన మంత్ర పుష్పములు వంటి విశేష పూజలు చేశారు. నవరాత్రుల్లో రెండో రోజు జోగుళాంబ అమ్మవారిని బ్రహ్మచారిణి మాతగా ఆరాధిస్తారని అర్చక స్వాములు తెలిపారు. అమ్మవారు దేవత శుద్ధ స్ఫటిక వర్ణములతో ప్రకాశించే స్వభావాన్ని కలిగి ఉంటారని వివరించారు. అమ్మవారి చేతిలో పుస్తకం, జపమాల, కమండలం, దండం కలిగి ఉంటారని భక్తులకు తెలిజేశారు. అమ్మవారిని పూజించిన వారికి జీవితంలో వచ్చే అనేక ఒడిదుడుకులను ధైర్యంగా ఎదర్కొనే శక్తి లభిస్తుందన్నారు.

ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యానుష్ఠానం, ఆవాహితా దేవత హోమాలు, నిత్య బలిహరణ, అర్చనలు, నీరాజన మంత్ర పుష్పములు, అమ్మవారికి నవాన్న సహిత మహానివేదన, బలిహరణ సమర్పణ వంటి పూజలు ప్రత్యేకంగా చేశారు. యాగశాలలో నిత్యానుష్ఠానం, ఆవాహిత దేవత హోమాలు, నిత్య బలిహరణ పూజలతో ఆరాధించారు. అదేవిధంగా కుంకుమార్చన మండపంలో కుంకుమార్చనలు, యాగశాలలో చండీహోమాలు కొనసాగాయి.

తరలివచ్చిన భక్తులు

అలంపూర్ క్షేత్ర ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. జోగుళాంబ అమ్మవారి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడతో క్యూలైన్‌ల వద్ద బారులుదీరారు. ఆలయ ప్రాంగణాలు భక్తుల సందడితో రద్దీగా మారాయి. భక్తులకు ఆలయ అధికారులు నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ పెరగడంతో అన్నప్రసాదం కోసం భక్తులు వెచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. సీఐ రవిబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆయా శాఖల అధికారులు భక్తుల సేవలో నిమగ్నమ య్యారు.

మాజీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

- నగర కమిషనర్‌పై అసభ్య పదజాలం
- ఆడియో వాట్సాప్‌లో హల్‌చల్
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన కమిషనర్

మహబూబ్‌నగర్ క్రైం/మున్సిపాలిటీ: మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించిన వ్యవహారంలో మాజీ కౌన్సిలర్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పలు రకాల సెక్షన్స్ కింద కేసు నమోదైనట్లు వన్‌టౌన్ సీఐ అప్పయ్య పేర్కొన్నారు. సీఐ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 7వ వార్డు శ్రీనివాస కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ నగర కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు కార్యాలయం వద్దకు వచ్చి తన విధులకు అటకం కల్గించేలా ప్రవర్తించాడని కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రభుత్వ అధికారి విధులకు అటంకం కలిగించిన క్రమంలో సెక్షన్ 221, 132, 133, 352 బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఉన్నత అధికారులకు ఫిర్యాదులు

మహబూబ్‌నగర్ నగర కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి మంగళవారం సాయంత్రం శ్రీనివాసకాలనీలో ఆయన అద్దెకు ఉన్న ఇంట్లో ఉండగా.. మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి పలు మార్లు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేసిన వెంటనే వ్యక్తిగతంగా దూషించారు. ఆ తర్వాత కమిషనర్ ఆఫీస్ వద్దకు వెళ్లగా.. అప్పటికే అక్కడ ఉన్న రవికిషన్‌రెడ్డి గేట్ దగ్గర ఎదురుపడ్డారు. అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతోపాటు హైడ్రామా కొనసాగింది. అప్పటికే వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్యతో పాటు పోలీసులు అక్కడికి చేరుకుని కట్టా రవికిషన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని అక్కడినుంచి వన్‌టౌన్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై కమిషనర్ ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్‌కు శివేంద్రప్రతాప్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లుకు రాతపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.



పోలీసులతో వాదిస్తున్న మాజీ కౌన్సిలర్ రవికిషన్‌రెడ్డి

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మన్ననూర్: ఐటీడీఏ పరిధి, నల్లమల పరీవాహక ప్రాంతంలోని చెంచుపెంటలు, గూడేల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయ సమావేశం హాలులో సంబంధిత వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్రాబాద్, పదర, అచ్చంపేట, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ అనుసంధానంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీఎం జన్‌మన్, మొబైల్ టీం, ఎంసీహెచ్ అపిడెమిక్ టీం అధికారులు, సిబ్బందితో చర్చించారు. సీజనల్ వ్యాధులు, టీబీ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసున్నారు. ముఖ్యంగా మారుమూల చెంచు పెంటల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎండీహెచ్ఓ రవికుమార్, ఎంహెచ్ఎం ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్, పీఎం జన్‌మన్ జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణమోహన్, మాతా శిశు సంక్షేమం, ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కె అధికారులు, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట తహసీల్దార్‌కు బెదిరింపు కాల్

- రూ.3లక్షలు ఇవ్వాలంటూ అగంతకుల డిమాండ్
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అధికారి


కొత్తకోట రూరల్: కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు గుర్తుతెలియని వ్యక్తి బెదిరింపు ఫోన్‌కాల్ చేసిన ఘటన చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం.. కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఆర్ఐ వాసు, సర్వేయర్ నవీన్‌రెడ్డి ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఇద్దరు ఈనెల 18న ఏసీబీకి పట్టుబడగా.. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈనెల 21న ఉదయం 11గంటలకు కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఫోన్ నెంబర్ 9000101525కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ నెంబర్ 9945194054 నుంచి ఫోన్‌చేసి నేను ఏసీబీ డీఎస్పీ హైదరాబాద్ నుంచి మాట్లాడుతున్నాను.. మీ ఆఫీసులో జరిగిన ఏసీబీ కేసులో చార్జ్‌షీట్ వేస్తున్నాం.. అందులో మీపేరు కూడా ఉంది.. మీ పేరు చార్జ్‌షీట్ నుంచి తొలగించాలంటే రూ.3లక్షలు ఇవ్వాలి.. లేదంటే మీపేరు కూడా లిస్టులో పెట్టి కోర్టుకు పంపిస్తామని డిమాండ్ చేసి భయపెట్టారు. తహసీల్దార్‌కు పదేపదే ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి తనను గుర్తు తెలియని వ్యక్తులు భయపెడుతున్నారంటూ.. అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన రెండో దశ ఐసెట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో సీట్ల భర్తీకి ప్రభుత్వం నిర్వహించిన ఐసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు పీయూలో రెండు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు ఈ నెల మొదటి వారంలో మొదటి దశ అడ్మిషన్లు కల్పించిన ప్రభుత్వం ఈ నెల 18 నుంచి రెండో దశ చేపట్టగా.. ఎంబీఏలో 60 సీట్లు ఉండగా 57 సీట్లు, అలాగే ఎంసీఏలో 60 సీట్లకు గాను 47 సీట్లు భర్తీ అయ్యాయి. మంగళవారం చివరిరోజు 30 మంది విద్యార్థులు పీయూలో రిపోర్టు చేసి అడ్మిషన్లు పొందారు. 18 సీట్లు ఖాళీగా ఉండడంతో మరోమారు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



వామ్మో.. ఇదెక్కడి చోద్యం





ఎవరైనా ఇంటి పక్కన విద్యుత్ స్తంభాలు ఉన్నా.. ఇంటి మీద తీగలు వేలాడుతున్న వాటిని తొలగించాలని సంబంధిత అధికారులను వేడుకుంటారు. కానీ, కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో ఓ వ్యక్తి ఏకంగా 11 కేవీ విద్యుత్ స్తంభాల మధ్యనే (ఆక్రమించి) ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ నిర్మాణం గత ఆరు నెలలుగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దీనికితోడు కాలనీవాసులు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినా తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కాగా.. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించినట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ 'సాక్షి'కి తెలిపారు. – కల్వకుర్తి టౌన్

రైల్వే బ్రిడ్జిలు నిర్మించండి

కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రికి ఎంపీ, ఎమ్మెల్యే వినతి

పాలమూరు: మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ మంగళవారం ఢిల్లీలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందించారు. పాలమూరులో రైల్వే గేట్ల వల్ల నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నగరం రోజురోజుకు విస్తరిస్తున్న క్రమంలో రైల్వే గేట్లు సమస్యగా మారాయని.. సరైన రోడ్డు విభజన లేకపోవడం వల్ల గేట్ పడిన ప్రతిసారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే టీడీగుట్ట, బోయపల్లి గేట్, తిమ్మసానిపల్లి రైల్వేగేట్ల వద్ద కేంద్రం నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. అదే విధంగా సద్దలగుండు, దివిటిపల్లిలో పాదాచారుల కోసం ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

కొండారెడ్డిపల్లిని అగ్రస్థానంలో నిలుపుదాం

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. మంగళవారం కొండారెడ్డిపల్లిలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల మంజూరు పత్రాలతో పాటు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 26న మెగా జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఉద్యోగాలు వచ్చిన వారంతా హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదని.. కొండారెడ్డిపల్లి నుంచి కంపెనీ వరకు బస్సు ఏర్పాటు చేస్తారని తెలిపారు. అదే విధంగా మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామన్నారు. దేశంలోని ఏ గ్రామంలో జరగని అభివృద్ధి కొండారెడ్డిపల్లిలో జరుగుతుందని.. ఇప్పటికే దాదాపు రూ. 100 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తిచేయడం జరిగిందన్నారు. కొండారెడ్డిపల్లి నుంచి డిండిచింతపల్లి వరకు ఫోర్‌లైన్స్ నిర్మాణానికి దాదాపు రూ. 56కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా గ్రామంలో పాఠశాల భవనం, పాలసేకరణ కేంద్రం, పోస్టాఫీస్ నిర్మాణాలతో పాటు శ్రీశైలం హైవేలోని రాంనగర్ గేట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 34కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ నెల 29న రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కొండారెడ్డిపల్లిలో అవసరమైన వసతులు కల్పించడం జరిగిందని.. ఇంకా ఏ అవసరాలు ఉన్నా తీర్చడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో కృష్ణారెడ్డి, వేమారెడ్డి, రాఘవేందర్, సురేందర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు ఉన్నారు.



వృద్ధురాలికి పింఛన్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జూరాలకు 3.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల 45 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న వరద

- ప్రాజెక్టు 45 క్రస్టుగేట్ల ఎత్తివేత
- జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- 3.42 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు..

ధరూరు/ఆత్మకూర్: కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వస్తోంది. సోమవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 2.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 8 గంటలకు 3.32 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 45 క్రస్టు గేట్లు ఎత్తి 3.14 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 25,676 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 580 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.651 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు వెల్లడించారు.

ఆరు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ప్రాజెక్టులోని 6 యూనిట్ల ద్వారా 6 యూనిట్ల ద్వారా 358.673 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 729.535 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశామని పేర్కొన్నారు. జూరాలకు వరద ప్రవాహం పెరగడంతో దిగువ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టలేదన్నారు.

రెండు గేట్లు తెరిచి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి రెండు గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం 6 గేట్లను తెరిచి నీటిని విడుదల చేయగా.. మంగళవారం ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గడంతో నాలుగు గేట్లను మూసి 2 గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 1,400 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. పెద్దవాగు ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లను తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సుంకేసులకు స్వల్పంగా..

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 21,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నాలుగు గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 17,916 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ మహేందర్ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి బలవన్మరణం



రమేష్ (ఫైల్)

హన్వాడ: భార్య పుట్టింటికి వెళ్లి, కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృత్యువాత పడిన ఘటన మునిమోక్షం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. మునిమోక్షం గ్రామానికి చెందిన కాశీపురం రమేష్ (27)కు మక్తల్ మండలంలోని పర్ధీపూర్ గ్రామానికి చెందిన కవితతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ ఈ నెల 21న తమ పొలంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి బాధితుడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమేష్ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఆస్పత్రిలోనే ప్రాణాలు వదిలాడు. కాగా మృతుడి తండ్రి కాశీపురం అంజిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

జడ్చర్ల: పట్టణంలో సోమవారం పరస్పరం దాడులకు పాల్పడిన ఘటనలో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన ఇద్దరు నిందితులను మంగళవారం ఆరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో వర్గానికి చెందిన ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అరెస్టు చేయనట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

గద్వాల క్రైం: దాడి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంగళవారం పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. పది రోజుల క్రితం పట్టణానికి చెందిన యువకులు దౌదరపల్లి కాలనీలోని బెల్టు దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అకారణంగా ఘర్షణ పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను పట్టణ శివారులో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.